భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
BHARATIYA JANATA PARTY
Telangana

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad-500 001.

23-08-2018

# పత్రికా ప్రకటన

ఎస్సీ, ఎస్టీ, బీసీలతో సహా అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నా, వారికి న్యాయం జరగాలన్నా ఒక్క బిజెపితోనే సాధ్యమవుతుందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టం చేయడం పట్ల గద్వాలలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ నిర్వహించిన భారీ అభినంద సభలో డా॥ కె.లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... కాంగ్రెస్ పాలనలో మోసపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు మోదీ ప్రభుత్వం ఎలా న్యాయం చేసిందో వివరించారు.

గత 70 సంవత్సరాలలో 57 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటుబ్యాంకుగా చూసి, వారికి తీరని ద్రోహం చేశారని అయితే నాలుగేళ్ల పాలనలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వారికి న్యాయం చేసేందని డా॥ లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించి వారికి తగిన న్యాయం చేసిన చరిత్ర బిజెపి సొంతమని అన్నారు. ఈ చట్టాన్ని లోక్‌సభలో సమర్థించిన కాంగ్రెస్ రాజ్యసభలో అడ్డుకొని తన నైజాన్ని బయటపెట్టుకుందని మండిపడ్డారు. దీనిని బీసీ సమాజం క్షమించదని తేల్చి చెప్పారు. బిజెపి చొరవ చూపి పట్టుబట్టడంతోనే కాంగ్రెస్ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిందని అన్నారు. అటు ఎస్సీ, ఎస్టీలకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని నీరుగారిస్తే... మోదీ ప్రభుత్వం చట్ట సవరణతో మరింత పటిష్టమైన చట్టాన్ని తీసుకొచ్చారని.., దళిత, గిరిజన వర్గాలకు రక్షణ కల్పించారని తెలిపారు. కానీ కాంగ్రెస్ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్‌ను ఓడించిందని, దళితనేత బాబూ జగ్జీవన్ రాం ప్రధానమంత్రి కాకుండా నిరోధించిందని, ఇలా అనేక రకాలుగా దళితులను మోసం చేసిందన్నారు. అందుకే దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలు, మహిళలు గ్రామీణులు, రైతులు, యువకులు అన్ని వర్గాలు బిజెపికి మద్దతుగా ఉన్నాయని స్పష్టం చేశారు.

దేశంలో ఒక్క కుటుంబమే పాలించాలన్న ధోరణితో ఉన్న కాంగ్రెస్ ఓ పేదింటి వ్యక్తి, బీసీ కులానికి చెందిన వ్యక్తి ప్రధానమంత్రి అయితే జీర్ణించుకోలేక పోతుందని దుయ్యబట్టారు. అందుకే మోదీ తినే తిండిపైనా, వేసుకునే బట్టలపైనా, నడకపైన, నడతపైన అక్కసు వెళ్లగక్కుతుందని విరుచుకుపడ్డారు. బిజెపితోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందంటూ... ఓ ముస్లిం మైనారిటీ అబ్దుల్ కలాంను, మరో దళితుడు రాంనాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని, బీసీ అయిన నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని, మహిళలను కేంద్రమంత్రులుగా, లోక్‌సభ స్పీకర్‌గా చేసిందని స్పష్టం చేశారు. పార్లమెంటులో అత్యధికంగా 73 మంది దళిత ఎంపీలు బిజెపికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని... బిజెపిని విమర్శిస్తున్న పార్టీలకు చురకలంటించారు.

మోదీ ప్రభుత్వం మహిళలకూ పెద్దపీట వేసిందని, కేంద్ర మంత్రివర్గంలో ఆరుగురు మహిళలు.. అదీ రక్షణ శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ లాంటి కీలక బాధ్యతలు అప్పజెప్పి స్త్రీశక్తికి సలాం కొట్టిందని అన్నారు. స్వచ్ఛ భారత్ పథకం కింద నాలుగేళ్లలోనే 7.80 కోట్ల మరుగుదొడ్లు కట్టించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిందని, వాటికి గౌరవంగా 'ఆత్మగౌరవ నిలయాలు'గా నామకరణం చేసిందని అన్నారు. ప్రసూతి సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు పెంచి వారి మహిళల ఉద్యోగ భద్రతనిచ్చిందని స్పష్టం చేశారు. కానీ తెలంగాణలో మహిళలను నిర్లక్ష్యం చేస్తూ ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ కోసం మహిళలు కొట్లాడింది ఇందుకేనా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమి ఇస్తానని, కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. కుటుంబ పాలన సాగిస్తూ తెలంగాణ తెచ్చుకుంది ఆ నలుగురి కోసమే అన్నట్టు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.

గద్వాలలో అధికంగా ఉండే మాదాసి కురుమలు ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీలుగా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎస్సీ సర్టిఫికేట్లు ఇవ్వక మోసం చేసిందని అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే మాదాసి కురుమలను ఎస్సీలుగా చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని స్పష్టం చేశారు. అటు టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో వెయ్యి రూపాయలు పెన్షన్ రాని ప్రస్తుత సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, టీచర్లకు మేలు చేసేలా పాత సీపీఎస్ విధానం

తీసుకొస్తామని వాగ్దానం చేశారు. వలస కూలీలుగా దుర్భర జీవితాన్ని అనుభవిస్తోన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన గద్వాల చేనేత కార్మికులను ఆదుకుంటామని అన్నారు. గద్వాలలో ఒక్క ఫ్లైఓవర్ కట్టించని సీఎం వంద కోట్లు ఇస్తామంటూ మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

మోదీ ప్రభుత్వ విజయాలను, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను 'ఇంటింటికి మోదీ – గడప గడపకూ బిజెపి' అన్న నినాదంతో ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు సామాజికి వారోత్సవాల పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడుతున్న బిజెపి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

దేశ ప్రజల సమగ్రాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, జీవన్ సురక్షా యోజన, సుకన్య సమృద్ధి యోజన, స్వచ్ఛ భారత్, ఉజ్వల లాంటి ఎన్ని పథకాలు తీసుకొచ్చి, వారి జీవితంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారని అందుకే ప్రజలే బిజెపిని గెలిపిస్తున్నారని తెలిపారు. అందుకే ముస్లింలు అధికంగా ఉండే జమ్మూ కశ్మీర్, క్రిస్టియన్లు అధికంగా ఉండే నాగాలాండ్, దళితులు, మైనారిటీలు ఎక్కువగా ఉండే యూపీలో, గిరిజనులు అధికంగా ఉండే చత్తీస్‌ఘడ్ సహా అనేక రాష్ట్రాల్లో బిజెపి విజయ దుందుభి మోగిస్తుందని స్పష్టం చేశారు. మోదీ అధికారంలోకి వచ్చాక పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు... మునిసిపాలిటీ నుంచి ముఖ్యమంత్రి వరకు... గల్లీ నుంచి దిల్లీ వరకు ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా బిజెపి విజయ ఢంకా మోగించిందని కుండబద్దలు కొట్టారు. అదే జోరుతో రేపు తెలంగాణలోనూ విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ సమక్షంలో టీడీపీ మాజీ రాజ్యసభ సభ్యుడు విజయ్ మోహన్ రెడ్డి తనయుడు, మాజీ జెడ్పీటీసీ వెంకటాద్రి రెడ్డి అనుచరులతో సహా బిజెపిలో చేరారు.

## వైఫల్యాలు కప్పిపుచ్చేందుకునేందుకే ముందస్తు

ప్రజల దృష్టి మరల్చేందుకు, తన పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం కేసీఆర్ ముందస్తు రాగం అందుకున్నారని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ విమర్శించారు. ప్రజలు ఐదు సంవత్సరాల కోసం ఎన్నుకుంటే... ఎందుకు 6 నెలల ముందుగానే ఎన్నికలకు పోతున్నారని ప్రశ్నించారు. అంతకుముందు మహబూబ్‌నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... టీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. అభివృద్ధికి ఆటంకం కలగకుండా, ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు బిజెపి జమిలి ఎన్నికల దిశగా ఆలోచన చేస్తుంటే... కేసీఆర్ రాష్ట్రంలో ఏకకాలంగా ఎన్నికలు జరిపేందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏకకాలంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాదరణ, బిజెపి జోరుకు కొట్టుకుపోతామని కేసీఆర్ బెంబేలెత్తుతున్నారని వ్యాఖ్యానించారు. అందుకే జమిలి ఎన్నికలకు మద్దతు తెలిపిన టీఆర్ఎస్ ఇప్పుడు ముందస్తు ఎన్నికలను తెరపైకి తీసుకొస్తుందని అన్నారు. అయితే ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒంటరిగానే 17 పార్లమెంట్, 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ముందస్తుగానే సాగనంపేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తో పొత్తుకు అర్రులు చాస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపైనా డా॥ లక్ష్మణ్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగు ఆత్మగౌరవం పేరుతో నందమూరి ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించారని, పార్టీ లక్ష్యాలకు దూరంగా టీడీపీ కాంగ్రెస్‌తో చేతులు కలపడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బాబు చర్యలతో ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నెతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. సైద్ధాంతిక విభేదాలు విస్మరించి రాష్ట్రంలో అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్న చరిత్ర చంద్రబాబుదని మండిపడ్డారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమస్యల పరిష్కారానికి బిజెపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు స్థానికంగా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయాలను, టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు గడప గడపకీ వెళ్తామని అన్నారు. సామాజిక వారోత్సవాలు, మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి ఉద్యమం పేరుతో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు బైక్ ర్యాలీలతో పాటు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. నిజాం కబంధ హస్తాల నుంచి తెలంగాణ విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవం జరపాలని డిమాండ్ చేస్తూ విమోచన యాత్రలు చేపడుతామని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఎంఐఎంతో అంటకాగిటివేనని, బిజెపి వస్తేనే అధికారిక విమోచన దినోత్సవం సాధ్యమవుతుందని డా॥ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

**కార్యాలయ కార్యదర్శి**